లయోల

# తెలుగు వాచకం

## 3వ తరగతి

## ప్రశ్నలు - జవాబులు



రచన, సంపాదకత్వం

భోగా నాగభూషణం శాలి

ప్రచురణ

లయోలా పబ్లికేషన్స్

హైదరాబాద్

పాఠం - 2

# విద్యమీద శ్రద్ధ

**1. శివయ్య దగ్గర సుందరుడు, మందరుడు ఏ విద్యలో శిక్షణ పొందుతున్నారు ?**

జ. శివయ్య దగ్గర సుందరుడు, మందరుడు శిల్ప విద్యలో శిక్షణ పొందుతున్నారు.

**2. సుందరుడు ఎలాంటి వాడు ?**

జ సుందరుడికి విద్యపై ఆసక్తి ఎక్కువ. అతను ఎంతో శ్రద్ధగా శిల్పాలను చెక్కడంలో నైపుణ్యం సంపాదించాడు.

**3. మందరుడు ఎలా ఉండేవాడు ?**

జ మందరుడికి బద్ధకం ఎక్కువ. విద్యపై ఆసక్తి తక్కువ. పైగా పనిలో తాను సుందరుడి కన్నా నేర్పరినని అను కునేవాడు.

**4. శివయ్య శిష్యులకు ఎలాంటి పరీక్ష పెట్టాడు ?**

జ శివయ్య తన శిష్యులకు చెరొక రాయి ఇచ్చి శిల్పాలను చెక్కుమని వారి ప్రతిభకు పరీక్ష పెట్టాడు.

**5. మందరుడు తన చేతిలోని ఉలిని ఎందుకు విసిరివేశాడు ?**

జ అందరు సుందరుడిని పొగుడుతుంటే మందరుడు తట్టుకో లేక పోయాడు. ఉక్రోషం ఆపుకోలేక తన చేతిలోని ఉలిని విసిరి వేశాడు.

**6. రెండవసారి పరీక్ష పెట్టినప్పుడు శివయ్య ఏం చేశాడు ?**

జ రెండవ సారి పరీక్ష పెట్టినప్పుడు శివయ్య శిల్పం చెక్కడానికి సుందరుడి ఉలి ఇచ్చాడు.

**7. మందరుడు ఓడిపోవడానికి శివయ్య ఏమని కారణం చెప్పాడు ?**

జ ' మందరుడు ఓడిపోవడానికి కారణం అతనికి పనిమీద శ్రద్ధ లేదు ' అని శివయ్య కారణం చెప్పాడు.

పాఠం - 3

# వేములవాడ

**1. వేములవాడ పుణ్యక్షేత్రం ఎక్కడ ఉంది ?**

జ వేములవాడ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో ఉంది.

**2. వేములవాడలో ఉన్న ఆలయాల గురించి రాయండి ?**

జ వేములవాడలో రాజరాజేశ్వర ఆలయం తో పాటు అనంత పద్మనాభస్వామి ఆలయం, సీతారామ చంద్ర ఆలయాలున్నాయి.

**3. కోడెను కట్టడం మొక్కు గురించి రాయండి ?**

జ ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే మానసిక రుగ్మతలు ఉంటే, వాటిని తగ్గిస్తే నీకు కోడెను కట్టేస్తాం అని భక్తులు మొక్కుకుంటారు. ఈ మొక్కును తీర్చుకోవడానికి వేములవాడకు వెళ్లిన వారు కోడెను దేవుడి చుట్టు తిప్పుతారు. అక్కడే కట్టేస్తారు. దీనిని కోడెను కట్టడం అంటారు.

**4. వేములవాడకు ఉన్న ఇతర పేర్లు రాయండి ?**

జ వేములవాడకు దక్షిణ కాశి, హరిహరక్షేత్రం అని పేర్లు ఉన్నాయి.

పాఠం - 4

# ముందుచూపు

**1. కొంగ జంట ఎక్కడ నివాసముండేది ?**

జ ఒక అడవిలో కొలను దగ్గర ఉన్న చెట్టుపైన కొంగ జంట నివాసముండేది.

**2. ఆడ కొంగ మగ కొంగను ఎందుకు వెళ్లిపోదామని చెప్పింది ?**

జ చెట్టు కింద పుట్టలో పాము ఉంది. అది చెట్టుమీద పక్షి పిల్లలను తినేస్తుంది. అందుకే మనం వెళ్లిపోదాం అని ఆడకొంగ మగ కొంగతో చెప్పింది.

**3. మగ కొంగ పామును చంపడానికి వేసిన పథకం ఏమిటి ?**

జ పామును చంపడానికి మగ కొంగ ముంగీసను ఉపయోగించాలనుకుంది. దానికోసం అది వచ్చే దారిలో చేపలను వేసి చెట్టు దగ్గరకు రప్పించాలనుకుంది.

**4. ముంగీస చివరకు ఏం చేసింది ?**

జ కింద పడి ఉన్న చేపలను తినుకుంటూ ముంగీస చెట్టుకింద ఉన్న పుట్ట దగ్గరకు వచ్చింది. పుట్టలోని పామును చూసి, భయంకరంగా పోరాడి దాన్ని చంపి వేసింది. తర్వాత దానికి పైన కొంగ గుడ్లు కనిపించాయి. చెట్టు మీదకు ఎక్కి ముంగీస ఆ గుడ్లను కూడా తీనేసిపోయింది.

**5. ముందుచూపు కథలోని నీతి గురించి రాయండి ?**

జ ఒక ఉపాయం ఆలోచించినప్పుడు దానితోపాటు వచ్చే ఆపదలను కూడ ఆలోచించ గలగాలి. లేక పోతే కొంగకి పట్టిన గతే పడుతుంది.

**పాఠం - 5**

# విరామచిహ్నాలు

**1.** **బిందువును ఎప్పుడు ఎలా ఉపయోగిస్తారు ?**

**జ** వాక్యం పూర్తిఅయినప్పుడు చివర బిందువును ఉపయోగిస్తారు.

**2.** **కామా గురించి వివరించండి ?**

**జ** వాక్యం చదివేటప్పుడు మధ్యలో ఒక్కక్షణం ఆగడానికి కామా ఉపయోగిస్తారు.

**3.** **ఆశ్చర్యార్థకాన్ని వాక్యంలో ఎక్కడ సూచిస్తారు ?**

**జ** వాక్యంలో ఆశ్చర్యం గొలిపే విషయం ఉంటే వాక్యం లేదా పదం చివర ఆశ్చర్యార్థకాన్ని పెడతారు.

**4.** **ప్రశ్నార్థకాన్ని వాక్యంలో ఎక్కడ ఉపయోగిస్తారు ?**

**జ** ఏదైనా విషయం గురించి ప్రశ్నస్తున్నప్పుడు వాక్యం చివర ఈ ప్రశ్నార్థకాన్ని పెడతారు.

**పాఠం - 6**

# సహకారం - ఉపకారం

**1. పావురము ఎక్కడ నివసించేది ?**

జ ముచికుంద నది ఒడ్డున ఉన్న మర్రి చెట్టుపై పావురము నివసించేది.

**2. నీటిలో కొట్టుకు పోతున్న చీమను చూసిన పావురానికి ఏమని అనిపించింది ?**

జ నీటిలో కొట్టుకు పోతున్న చీమను చూసిన పావురానికి జాలి వేసింది. దానిని ఎలాగైనా కాపాడాలని అనుకున్నది.

**3. చీమను పావురం ఎలా కాపాడింది ?**

జ చీమ తను కూర్చున్న మర్రి చెట్టుకు ఉన్న ఆకులలో ఒకటి తెంపి ఎగురుకుంటూ వెళ్లి చీమ ముందు పడ వేసింది. వేంటనే చీమ ఆకుపైకి ఎక్కి కూర్చుంది. ఆకు ఒడ్డు వైపు రాగానే చీమ నేలపైకి వచ్చింది.

**4. వేటగాడి బాణం పావురానికి తగలకుండా చీమ ఏమి చేసింది ?**

జ వేటగాడు చెట్టు చాటునుండి పావురానికి బాణం గురి పెడుతున్న సమయంలో చీమ అతని కాలిని గట్టిగా కుట్టింది. ఆ బాధకు వేటగాడు బాణం వదిలేశాడు. బాణం గురి తప్పింది. పావురం ఎగిరి పోయింది.

**5. సహకారం - ఉపకారం కథలో ఉన్న నీతి ఎమిటి ?**

జ మంచి వాళ్లకు తెలియకుండానే మంచి జరుగుతుంది. అందుకే తమకు చేతనైన సహాయం ఇతరులకు చేయాలి.

పాఠం - 7

# ఆచార్య వినోబా భావే

**1. వినోబా భావే నడిపిన ఉద్యమాల పేర్లు రాయండి ?**

జ వినోబా భావే భూదానోద్యమం, గ్రామదాన ఉద్యమం నడిపారు.

**2. వినోబా భావేను ఎంతో ప్రభావితం చేసిన పుస్తకం పేరేమిటి ?**

జ వినోబా భావేను ఎంతో ప్రభావితం చేసిన పుస్తకం పేరు భగవద్గీత.

**3. వినోబా భావే జైల్లో ఉన్నప్పుడు ఏం చేశారు ?**

జ వినోబా భావే జైల్లో ఉన్నప్పుడు ఎన్నో పుస్తకాలు చదివారు. కొన్నిరచనలు చేశారు. కన్నడం, తెలుగు, తమిళం, మళయాళ భాషలు నేర్చుకున్నారు. 'లోక్‌నగర్' పేరుతో కొత్త లిపి కనిపెట్టారు. ఖైదీలకు మరాఠీ భగవద్గీత భోదించారు.

**4. వినోబా భావే భూదాన ఉద్యమాన్ని ఎప్పుడు ఎక్కడ ప్రారంభించారు ?**

జ వినోబా భావే భూదాన ఉద్యమాన్ని 1951 సంవత్సరంలో నల్లగొండ జిల్లా పోచంపల్లి గ్రామం నుండి ప్రారంభించారు.

**5. వినోబా భావే మరణించినప్పుడు మన దేశ ప్రధానిగా ఎవరు పని చేస్తూ ఉన్నారు ?**

జ వినోబా భావే మరణించిన సమయంలో మన దేశ ప్రధానిగా శ్రీమతి ఇందిరాగాంధి ఉన్నారు.

పాఠం - 8

# గద్ద - పిల్లి

1. **గద్ద ఆహారం ఎందుకు సంపాదించుకో లేక పోయేది ?**

జ గద్ద ముసలిదై పోవటంతో తన ఆహారం సంపాదించుకోలేక పోయేది.

2. **పక్షులు ఇచ్చిన ఆహారానికి బదులుగా గద్ద ఏం చేసేది ?**

జ పక్షులు ఇచ్చిన ఆహారానికి బదులుగా గద్ద ఆ పక్షుల పిల్లలను కాపలా కాస్తూ కాలం గడుపుతూ ఉండేది.

3. **పిల్లి ఎందుకు భయపడింది ?**

జ పక్షి పిల్లలను తినాలని వచ్చిన పిల్లి అక్కడ గద్ద కనిపించడంతో భయపడింది.

4. **పిల్లి మాటల్లో పడిపోయిన ముసలి గద్ద ఏం చేసింది?**

జ ముసలిగద్ద పిల్లిమాటల్లో పడిపోయి అయ్యోపాపం అనుకుంది. తాను ఉన్న తొర్రలో ఉండడానికి అనుమతిచ్చింది.

5. **పిల్లి తొర్రలోకి వచ్చాక ఏం చేసింది ?**

జ తొర్రలోకి వచ్చిన పిల్లి ప్రతిరోజు రాత్రి చెట్టు ఎక్కి కొన్ని కొన్ని పక్షి పిల్లలను తొర్రలోకి తెచ్చుకుని చంపి తినేసేది. వాటి బొమికలు ఆ తోర్రలో వదిలేసి పోయేది.

6. **పక్షులు ఎందుకు ముసలి గద్దను చంపి వేశాయి ?**

జ గద్ద తొర్రలో ఉన్న బొమికలు చూసి పక్షులు ఈ గద్దే మన పిల్లలను తినేసింది అనుకున్నాయి. కోపంతో గద్దమీదపడి గోళ్లతో రక్కి చంపి వేశాయి.

**పాఠం - 10**

# పేరులో ఏముంది ?

**1. పాపకునికి తన పేరుమీద ఎందుకు అసహ్యం కలిగేది ?**

జ తనను పాపకా రా, పాపకా పో అంటూ అందరూ పిలుస్తూ ఉంటే పాపకునికి అదోలా ఉండేది. ఆయుష్మాన్ పాపకా అని ఎవరైనా దీవిస్తే ఏమిటోగా ఉండేది. దాంతో అతనికి తన పేరు మీద అసహ్యం కలిగేది.

**2. పాపకుడు తన గురువు బోధిసత్త్వుడిని ఏమని అడిగాడు ?**

జ పాపకుడు తన గురువు భోధిసత్త్వుడిని 'ఆచార్యా, నాపేరు అమంగళకరంగా అనిపిస్తుంది. నాకు మరొక మంచి పేరు పెట్టండి ' అని అడిగాడు.

**3. బోధి సత్త్వుడు పాపకుడికి ఏమి చెప్పాడు ?**

జ బోధిసత్త్వుడు పేరువల్ల గుర్తింపు తప్ప మరే ఉపయోగం లేదని పాపకుడికి చెప్పాడు. అయినా పాపకుడు వినకపోవడంతో ' ఒకసారి దేశాటనం చేసిరా, ఈ దేశ పర్యటనలో నీకు ఏ పేరు మంగళకరంగా అనిపిస్తుందో తెలుసుకొనిరా. నీకు ఆ పేరే పెడతాను ' అని బోధిసత్త్వుడు చెప్పాడు.

**4. జీవకుడిని తీసుకు వెళుతున్నవారు పాపకుడిని ఏమని అన్నారు ?**

జ జీవకుడుని తీసుకు వెళుతున్నవారు పాపకుడితో ' జీవకుడు చనిపోతాడు అజీవకుడు చనిపోతాడు. పేరులో ఏముంది? నీవాలకం చూస్తుంటే నీకు జ్ఞానం తక్కువలా ఉంది ' అని అన్నారు.

**5. ధనపాలిని కొడుతున్నవాడు పాపకుడికి ఏమి చెప్పాడు ?**

జ ధనపాలిని కొడుతున్నవాడు పాపకుడితో, ధనపాలిగానీ, నిర్ధనపాలి కానీ, ఎవరైనా దుర్గతి పొందవచ్చు. పేరు గుర్తింపుకు మాత్రమే. ఈ మాత్రం తెలియదా ? చూస్తుంటే నీకు బుద్ధి తక్కువ ఉన్నట్లు అనిపిస్తుంది ' అని అన్నారు.

**6. పాంథకుడు పాపకుడికి ఏమని చెప్పాడు ?**

జ పాంథకుడు పాపకుడికి 'దారి తప్పడానికి పాంథకుడయితే ఏమిటి? అపాంథకుడు అయితే ఏమిటి? పేరులో ఏముంది? చూస్తుంటే నీకు బుద్ధి కొరవడినట్లుంది ' అని చెప్పాడు.

**7. చివరకు పాపకుడు తన గురువుకి ఏమని చెప్పాడు ?**

జ చివరకు పాపకుడు తన గురువుతో 'గురూజీ, నాకు జ్ఞానోదయం కలిగింది. మనిషిలోనే తప్ప పేరులో ఏమి లేదని నేను అర్థం చేసుకున్నాను. ఇక నుంచి నా పేరు గురించి నేను విచారించను' అని చెప్పాడు.

పాఠం - 11

# అమ్మకు వందనం

**1. ' అమ్మకు వందనం' గేయంలో అమ్మను ఏయే పేర్లతో వర్ణించారు ?**

జ అమ్మకు వందనం గేయంలో అమ్మను మాతృమూర్తి, అమృతమూర్తి, త్యాగమూర్తి, పుణ్యమూర్తి పేర్లతో వర్ణించారు.

**2. అమ్మ ఏం చేస్తుందో రెండు మూడు వాక్యాల్లో రాయండి?**

జ అమ్మ పిల్లలకు దారి చూపుతుంది, అనురాగం పంచి ఇస్తుంది. కంటి పాపలా చూసుకుంటుంది. భావి పౌరులుగా తీర్చిదిద్దుతుంది.

పాఠం - 12

# కొంగ జపం

**1. సరస్సులో ఏమేమి ఉండేవి ?**

జ సరస్సులో చేపలతో పాటు ఒక ఎండ్రకాయ ఉండేది.

**2. ఎండ్రకాయ కొంగ దగ్గరకు వెళ్లి ఏమని అడిగింది?**

జ ఎండ్రకాయ కొంగ దగ్గరకు వెళ్లి 'కొంగ మహాశయా, ఇదేమిటి? ఇలా ఒంటి కాలి మీద నిలబడ్డావు?' అని అడిగింది.

**3. కొంగ ఎండ్రకాయకు ఏమని సమాధానమిచ్చింది?**

జ కొంగ ఎండ్రకాయకు 'నేను చాలా చేపలను తిని పాపం చేశాను. ఒక రోజు ఒక మహానుభావుడు తన విద్యార్థులకు ఉపదేశమిస్తూ ఇతర ప్రాణులను చంపటం చాలా పాపం. అలా చేసిన వాళ్లు నరకానికి పోతారని చెప్పారు, అది విని నేను పశ్చాత్తాప పడి ఇలా జపం చేసుకుంటూ బతుకుతున్నాను ' అని సమాధానమిచ్చింది.

**4. భయపడిపోయిన చేపలు కొంగను ఏమని వేడుకున్నాయి ?**

జ భయపడిపోయిన చేపలు కొంగను ' అయ్యా, మీరు పెద్దవారు. ఏదో ఒక ఉపాయం ఆలోచించి మమ్మల్ని ఈ కష్టం నుంచి గట్టెక్కించండి ' అని వేడుకున్నాయి.

**5. ఎండ్రకాయ ఎందుకు భయపడింది ?**

జ ప్రతి రోజూ కొంగ చేపలను కొండమీదకు తీసుకెళ్లడంతో సరస్సులో చేపలు తగ్గి పోవడం మొదలు పెట్టాయి. అలా చేపలన్నీ అయిపోతూ ఉండడంతో, తను ఒంటరిగా ఉండలేనని భావించి ఎండ్రకాయ భయపడింది.

పాఠం - 14

# ఒగ్గుకథ పితామహులు - మిద్దెరాములు

**1. ఒగ్గుకథ పితామహులు ఎవరు ?**

జ ఒగ్గుకథ పితామహులు మిద్దెరాములు.

**2. మిద్దె రాములు ఎక్కడ జన్మించారు?**

జ మిద్దె రాములు కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామంలో జన్మించారు.

**3. మిద్దె రాములు చెప్పిన ముఖ్యమైన ఒగ్గుకథల పేర్లు రాయండి?**

జ ఎల్లమ్మ కథ, మల్లమ్మకథ, సారంగధర, ఐదు మల్లెపూలు, గంగా గౌరి సంవాదం.

**4. మిద్దె రాములు ప్రత్యేకత గురించి మూడు నాలుగు వాక్యాల్లో రాయండి ?**

జ మిద్దె రాములు అక్షర .జ్ఞానం లేకున్నా ఆశుకవిగా పేరుగాంచారు. సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేరీతిలో మిద్దె రాములు ఒగ్గ కథ చెప్పేవారు. దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. పక్షులు, చెట్లు, జంతువుల పేర్లతో మిద్దె రాములు చెప్పే ఒగ్గ కథల్లో జీవం కనిపించేది.

**5. ధూంధాం సంస్కృతిక ప్రదర్శనలో మిద్దె రాములు ఏం చేసేవారు ?**

జ ధూం ధాం సాంస్కృతిక ప్రదర్శనలో మిద్దె రాములు బోనం ప్రత్యేకంగా నిలిచేది. నెత్తిన బోనం ఎత్తుకుని ఒగ్గుకథ చెప్పేవారు. బోనంపై నిలిపిన జ్యోతి ఆరకుండా ఎత్తిన బోనంతో పాటు నేలపై పడుకుని రూపాయి నాణాన్ని నోటితో తీసి చూపించేవారు.

**6. మిద్దె రాములు ఏమని కలగన్నారు ?**

జ మిద్దె రాములు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఒగ్గ కథ నేర్పించే బడి పెట్టాలని కలలుగన్నారు. కానీ ఆ కోరిక తీరకుండానే ఆయన చనిపోయారు.

పాఠం - 16

# కొయ్య బొమ్మల 'నిర్మల్'

**1. నిర్మల్ పట్టణం దేనికి ప్రసిద్ధి ?**

జ నిర్మల్ పట్టణం అందమైన కొయ్య బొమ్మలకు ప్రసిద్ధి.

**2. నిర్మల్ బొమ్మల తయారీకి వాడే చెక్క పేరేమిటి?**

జ నిర్మల్ బొమ్మల తయారీకి వాడే చెక్క పేరుపొనికి చెక్క.

**3. పొనికి చెక్కతో ఏమేం బొమ్మలు తయారు చేస్తారు?**

జ పొనికి చెక్కతో పక్షులు, జంతువులు, ఫలాలు లాంటి బొమ్మలు తయారు చేస్తారు.

**4. నిర్మల్ బొమ్మలకు వాడే సహజ రంగులను వేటితో తయారు చేస్తారు ?**

జ నిర్మల్ బొమ్మలకు వాడే సహజ రంగులను చెట్ల ఆకులు, వేర్లు, బెరడు, గింజలతో తయారు చేస్తారు.

**5. నిర్మల్ బొమ్మలు, వర్ణచిత్రాలు ఏయే దేశాలకు ఎగుమతి అవుతున్నాయి ?**

జ నిర్మల్ బొమ్మలు, వర్ణచిత్రాలు ఆస్ట్రేలియా, అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

పాఠం - 17

# నీతి పద్యాలు

**1. సమయం చూసి విపత్తులు కల్గించేవి ఏవి ?**

జ నేలమీద పచ్చికాయలు ఏరుకుని తినకూడదు, చుట్టాలను తిట్టకూడదు, యుద్ధంలో వెనుతిరిగి పారిపోవద్దు, పెద్దల ఆజ్ఞను అతిక్రమించకూడదు. ఇవన్నీ సమయం చూసి విపత్తులు కలిగిస్తాయి.

**2. నీ కోపము నీకు శత్రువా? మిత్రువా?**

జ మన కోపమే మనకు శత్రువు. మిత్రువు కాదు.

**3. నాకే బలం ఉందని పోట్లాడితే ఏమవుతుంది?**

జ నాకే బలం ఉందని ఇతరులతో పోట్లాడకూడదు. ఎంతో బలం ఉన్న అంత పెద్ద పాము చిన్న చీమల చేతుల్లో చిక్కి చనిపోతుంది. ఇది గ్రహించాలి.

**4. వేటిని విడిచి పెట్టాలి ?**

జ అవసరానికి పనికిరాని చుట్టమును, యుద్ధంలో ముందుకు పరుగెత్తని గుర్రమును వెంటనే విడిచి పెట్టవలెను.

పాఠం - 18

# అపాయంలో ఉపాయం

1. **గొర్రెల కాపరికి ఎన్ని మేకల మంద ఉన్నది ?**

జ గొర్రెల కాపరికి ఒక వంద మేకల మంద ఉన్నది.

2. **గొర్రెల కాపరి మేకపోతు పిల్లను ఎక్కడ వదిలేశాడు?**

జ గొర్రెల కాపరి మేకపోతు పిల్లను అడవిలో వదిలేశాడు.

3. **మేకపోతు పిల్ల ఎవరి గుహలో దాచుకుంది?**

జ మేకపోతుపిల్ల పెద్దపులి ఉండే గుహలో దాచుకుంది.

4. **మేకపోతు పిల్ల పులికి భయపడి కూడ ఏమని జవాబిచ్చింది ?**

జ మేకపోతు పిల్ల పులికి భయపడి కూడ పెద్దగొంతు చేసుకుని ‘ ఏయ్, ఎవరనుకున్నావు. నేను పోతురాజును, మూరెడు మూరెడు మీసాలు, బారెడు బారెడు గడ్డాలు. తాకుడు తాకుడుకే పన్నెండొచ్చలు ’ అని జవాబిచ్చింది.

5. **నక్క పులికి ఏమని సలహా ఇచ్చింది ?**

జ నక్క ‘నీకు భయమైతే ఇద్దరం తోకలు ముడేసుకుని పోదాం. ఇద్దరిని చూసి ఆ మెకానికే భయంపుట్టి పోన్న పోతది. చచ్చున్న పోతది.’ అని సలహా ఇచ్చింది.

6. **మేకపోతు పిల్ల పులిని నక్కని ఏమని బెదిరించింది ?**

జ మేకపోతు పిల్ల పులిని, నక్కని ‘ఆయ్, ఎవర్రా మళ్లీ వచ్చింది. మూరెడు, మూరెడు మీసాలు, బారెడు బారెడు గడ్డాలు, పోతరాజును నేను, తాకుడు తాకుడుకే పన్నెండొచ్చలు. నక్కను నమిలి మింగుతా, పులిని బుక్క పెడుత, ఎవర్రా రండి లోపలికి ’ అంటూ పెడబొబ్బలు పెట్టి బెదిరించింది.

పాఠం - 20

# దీపావళి

**1. దీపావళి అంటే ఏమిటి ?**

జ దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం.

**2. దీపావళి పండుగను ఎప్పుడు జరుపుకుంటారు?**

జ దీపావళి పండుగను ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ బహుళ అమావాస్య రోజున జరుపుకుంటారు.

**3. దీపావళి పండుగ ముందు రోజును ఏమని పిలుస్తారు?**

జ దీపావళి పండుగ రోజును నరక చతుర్థశి అని పిలుస్తారు.

**4. నరక చతుర్థశి రోజున ఏమేం చేస్తారు ?**

జ నరక చతుర్థశి రోజున సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి నువ్వులనూనె ఒంటికి రాసుకుని స్నానం చేస్తారు. అన్నయ్యలకు చెల్లెళ్లు హారతులు పడతారు. కొందరు బొమ్మల కొలువు పెడతారు.

**5. దీపావళి రోజున ఏమేం చేస్తారు?**

జ దీపావళి రోజున లక్ష్మీదేవిని తమ ఇంట్లోకి ఆహ్వానిస్తూ ఇళ్లను దీపాలతో అలంకరించి లక్ష్మీపూజ చేస్తారు. కొత్తగా పెళ్లైనవారికి కొత్త బట్టలు, కానుకలు సమర్పిస్తారు. వ్యాపారులు తమ పాత ఖాతాపుస్తకాలు తీసివేసి కొత్తవి తెరుస్తారు.

**6. దీపావళిని మన దేశంతోపాటు ఇంకా ఏయే దేశాల్లో జరుపుకుంటారు ?**

జ దీపావళిని మనదేశంతో పాటు నేపాల్, శ్రీలంక, మయన్మార్, మారిషస్, గయానా, టొబాగో, సూరినాం, మలేషియా, సింగపూర్, ఫీజీ దేశాలలో జరుపుకుంటారు.

పాఠం - 21

# పుణ్యభూమి

**1. వీర పాండ్య కట్ట బ్రహ్మన ఎవరు ? ఆయన ఎలా చనిపోయారు ?**

జ ఆంగ్లేయులు విధించిన శిస్తును వ్యతిరేకించిన రాజు వీరపాండ్య కట్ట బ్రహ్మన. మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి చివరకు ఉరిపాలై చనిపోయారు.

**2. అల్లూరి సీతారామరాజు ఎవరు? ఆయన దేశం కోసం ఏం చేశారు ?**

జ తెల్ల దొరల పెత్తనాన్ని నిరసించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటం చేశారు.

పాఠం - 22

# తెలంగాణ రాష్ట్రం

**1. భారత దేశంలో 29 వ రాష్ట్రంగా ఏర్పడిన ప్రాంతం పేరేమిటి ?**

జ భారత దేశంలో 29 వ రాష్ట్రంగా ఏర్పడిన ప్రాంతం తెలంగాణ.

**2. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది?**

జ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**3. తెలంగాణ రాష్ట్ర రాజధాని పేరేమిటి ?**

జ తెలంగాణ రాష్ట్రం రాజధాని పేరు హైదరాబాద్.

**4. తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన నదులు పేర్లు రాయండి ?**

జ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమైన నదులు కృష్ణ, గోదావరి.

**5. తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన అధికారిక చిహ్నాలు తెలపండి ?**

జ తెలంగాణ రాష్ట్రీయపక్షి పాలపిట్ట, రాష్ట్రీయ జంతువు మచ్చల జింక, రాష్ట్రీయ పుష్పం తంగేడుపూవు, రాష్ట్రీయ వృక్షం జమ్మిచెట్టు.

**6. మూసీనది ఎక్కడ నుండి ప్రారంభమవుతుంది ?**

జ మూసీనది రంగారెడ్డి జిల్లా వికారాబాద్ పట్టణంలోని అనంతగిరి కొండల నుండి ప్రారంభమవుతుంది.

**7. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్న ధార్మిక స్థలాలు తెలియ చేయండి ?**

జ చార్మినార్, మక్కామసీద్, బిర్లా టెంపుల్, సీతారామ్ భాగ్, గణపతి దేవాలయం, మహంకాళీ దేవాలయం, సూర్యదేవాలయం, నాగమాత గుడి, పెద్దమ్మ తల్లి గుడి, జైన్ మందిర్, బుద్ధవిహార్, సిక్కుల గురుద్వార్, క్రైస్తవ ప్రార్థనా స్థలాలు లాంటివి ఎన్నో, హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో ఉన్నాయి.

పాఠం - 24

# స్వాతంత్ర్యదినోత్సవం

1. **స్వాతంత్ర్యదినోత్సవం ఏ రోజు జరుపుకుంటాము ?**

జ ప్రతి సంవత్సరం ఆగష్టు నెల 15 వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటాము.

2. **భారత దేశానికి ఎప్పుడు స్వాతంత్ర్యం లభించింది ?**

జ 1947 సంవత్సరం ఆగష్టు 15 వ తేదీన భారత దేశానికి స్వాతంత్ర్యం లభించింది.

3. **భారత దేశ తొలి ప్రధాని పేరు ఏమిటి ?**

జ భారత దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ.

4. **గాంధీజీ ఏ సిద్ధాంతంతో స్వాతంత్రోద్యమం నడిపించారు ?**

జ గాంధీజీ అహింసా సిద్ధాంతంతో స్వాతంత్రోద్యమం నడిపించారు.

5. **ప్రస్తుతం మన దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఉన్నాయి ?**

జ ప్రస్తుతం మనదేశంలో 29 రాష్ట్రాలు ఉన్నాయి.

పాఠం - 25

# దిక్కులు

1. **దిక్కులు ఎన్ని ? వాటి పేర్లు రాయండి ?**

జ దిక్కుల నాలుగు. అవి తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం.

2. **తూర్పుకు ఎదురుగా ఉండే దిక్కు పేరేమిటి ?**

జ తూర్పుకు ఎదురుగా ఉండే దిక్కు పడమర.

3. **ఉత్తరానికి ఎదురుగా ఉండే దిక్కు పేరేమిటి ?**

జ ఉత్తరానికి ఎదురుగా ఉండే దిక్కు దక్షిణం.

4. **సూర్యుడు ప్రతిరోజు ఏదిక్కున ఉదయిస్తాడు?**

జ సూర్యుడు ప్రతిరోజు తూర్పు దిక్కున ఉదయిస్తాడు.

5. **సూర్యుడు ప్రతిరోజు ఏ దిక్కున అస్తమిస్తాడు ?**

జ సూర్యుడు ప్రతిరోజు పడమర దిక్కున అస్తమిస్తాడు.

పాఠం - 26

# లాల్ బహదూర్ శాస్త్రి

1. **లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన నినాదం ఏమిటి?**

జ లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్ జై కిసాన్' నినాదంతో భారత ప్రజలను మేల్కొలిపారు.

2. **లాల్ బహదూర్ శాస్త్రి ఎప్పుడు జన్మించారు ?**

జ లాల్ బహదూర్ శాస్త్రి 1904 సంవత్సరం అక్టోబర్ నెల రెండవ తేదీన జన్మించారు.

3. **లాల్ బహదూర్ శాస్త్రి తన ఇంటి పేరును ఎందుకు తొలగించుకున్నారు ?**

జ లాల్ బహదూర్ శాస్త్రి ఇంటిపేరు శ్రీవాస్తవ. ఇది కులాన్ని సూచిస్తుందని భావించి లాల్ బహదూర్ శాస్త్రి తన పేరులోంచి తొలగించారు.

4. **లాల్ బహదూర్ శాస్త్రి తన పెళ్లి సందర్భంగా వరకట్నంగా ఏమి తీసుకున్నారు ?**

జ లాల్ బహదూర్ శాస్త్రి తన పెళ్లిలో వరకట్నంగా ఒక చరఖాను, కొన్న గజాల ఖాదీ వస్త్రాన్ని మాత్రమే తీసుకున్నారు.

5. **లాల్ బహదూర్ శాస్త్రికి ఆత్మాభిమానం ఎక్కువ అని తెలియ చేసే సంఘటనను క్లుప్తంగా రాయండి ?**

జ లాల్ బహదూర్ శాస్త్రికి ఆత్మాభిమానం ఎక్కువ. ఆయన జైలులో ఉన్నప్పుడు ఒకసారి ఆయన కుమార్తెలలో ఒకరు తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ఆ విషయం తెలిసి జైలు అధికారులు కొంత కాలం విడుదల చేస్తామని లాల్ బహదూర్ శాస్త్రికి చెప్పారు. అయితే వారు స్వాతంత్రోద్యమంలో పాల్గొనని రాత పూర్వకంగా తెలియజేస్తే విడుదల చేస్తామని ఒక నిబంధన విధించారు. లాల్ బహదూర్ శాస్త్రి దానికి ఒప్పుకోలేదు. జైలులోనే శిక్షా కాలం పూర్తి చేశారు.

లయోల

# తెలుగు వాచకం

## 4వ తరగతి

## ప్రశ్నలు - జవాబులు




రచన, సంపాదకత్వం

భోగా నాగభూషణం శాలి



ప్రచురణ

లయోలా పబ్లికేషన్స్

హైదరాబాద్

పాఠం - 2

# పి.వి. నరసింహారావు

**1. పి.వి.నరసింహారావు ఎక్కడ జన్మించారు ? వారి తల్లిదండ్రుల పేరేమిటి ?**

జ. పి.వి.నరసింహారావు వరంగల్ జిల్లా సర్వంపేట మండలం, లక్నేపల్లిలో జన్మించారు. ఆయన తల్లి పేరు రుక్మాబాయి, తండ్రి పేరు సీతారామారావు.

**2. పి.వి.నరసింహారావు ఏ సందర్భంలో వందేమాతర గీతం పాడారు ?**

జ 1938 సంవత్సరంలో పి.వి.నరసింహారావు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో చేరి అప్పటి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ వందేమాతర గేయాన్ని పాడారు.

**3. పి.వి.నరసింహారావును ఆర్థిక సంస్కరణల పితామహుడు అని ఎందుకు పిలిచారు ?**

జ మన దేశ ప్రధానిగా ఉన్న కాలంలో పి.వి.నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. దివాలా తీసే పరిస్థితుల్లో ఉన్న ఆర్థిక వ్యవస్థను చక్క బెట్టి పునర్జీవం పోశారు. అందుకే పి.వి.నరసింహారావును ఆర్థిక సంస్కరణల పితామహుడు గా పిలిచారు.

**4. పి.వి.నరసింహారావు తెలుగు నవల 'వేయి పడగల'ను ఏపేరుతో హిందీలోకి అనువదించారు ?**

జ పి.వి.నరసింహారావు తెలుగు నవల వేయి పడగలను హిందీలో 'సహస్రఫణ్' పేరుతో అనువదించారు.

పాఠం - 3

# కోతి - డోలు

1. **కోతి ఎందుకు బాధపడింది ?**

జ పని పాటాలేని కోతి పిచ్చి పనులు చేస్తుంటే దాని తోకకు ముల్లు గుచ్చుకుంది. అందుకే అది బాధపడింది.

2. **ముందుగా కోతికి ఎవరు కనిపించారు ? ఏమి చేశారు ?**

జ ముందుగా కోతికి మంగళి కనిపించాడు. దాని బాధ చూసి తన దగ్గర ఉన్న కత్తితో ముల్లు తీయడానికి ప్రయత్నించాడు. అలా చేస్తున్నప్పుడు పొరబాటున దాని తోక తెగిపోయింది. దాంతో అతను ఏమీ చేయలేక తన కత్తిని దానికి ఇచ్చేసి వెళ్ళి పోయాడు.

3. **కోతి కట్టెలు తీసుకుని ముసలమ్మ ఏమి చేసింది ?**

జ కోతి కట్టెలు తీసుకుని ముసలమ్మ పొయ్యిలో వేసి పెనంపెట్టి జొన్న రొట్టెలు చేసింది.

4. **కోతి డోలు తీసుకుని ఎమని పాట పాడింది ?**

జ తోకపోయి కత్తివచ్చె ఢాం ఢాం ఢాం
కత్తిపోయి కట్టె వచ్చె ఢాం ఢాం ఢాం
కట్టెపోయి రొట్టె వచ్చె ఢాం ఢాం ఢాం
రొట్టెపోయి డోలు వచ్చె ఢాం ఢాం ఢాం
ఢాం ఢాం ఢాం ఢాం ఢాం ఢాం ఢాం ఢాం

పాఠం - 4

# మహాకవి గురజాడ

**1. తెలుగులో మొట్టమొదటి అతిగొప్ప నాటకం పేరేమిటి? దాన్ని ఎవరు రాశారు ?**

జ తెలుగులో మొట్టమొదటి అతిగొప్ప నాటకం 'కన్యాశుల్కం'. దానిని గురజాడ అప్పారావు రాశారు.

**2. గురజాడ అప్పారావు ఎక్కడ జన్మించారు ?**

జ గురజాడ అప్పారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్టణం జిల్లా ఎలమంచిలికి సమీపంలోని రాయవరం గ్రామంలో జన్మించారు.

**3. దేశభక్తిని ప్రభోధిస్తూ గురజాడ అప్పారావు రాసిన గేయం పేరేమిటి ?**

జ దేశభక్తిని ప్రభోధిస్తూ గురజాడ అప్పారావు 'దేశమును ప్రేమించు మన్నా ... మంచి యన్నది పెంచుమన్నా ' గేయం రాశారు.

**4. గురజాడ అప్పారావు రాసిన ఇతర రచనలు ఏమిటి ?**

జ ముత్యాల సరాలు, కొండ భట్టీయం, పూర్ణమ్మ, కన్యక.

పాఠం - 5

# ముని - తేలు

**1. నదిలో స్నానం చేస్తున్న మునికి ఏమి కనిపించినది ?**

జ నదిలో స్నానం చేస్తున్న మునికి ఆ నీళ్లలో కొట్టుకు పోతున్న ఒక కొమ్మపై ప్రాణ భయంతో అటు ఇటు పరుగెత్తుతున్న తేలు కనిపించింది.

**2. తేలును చూసి ముని ఏమి చేశారు ?**

జ కొమ్మమీద ఉన్న తేలును చూసి ముని దాన్ని తన చేతిలోకి తీసుకున్నారు. తేలును నది ఒడ్డు మీద వదిలేద్దాము అని బయలు దేరారు.

**3. అన్ని సార్లు తేలు కుట్టినా ముని చివరకు ఏమి చేశారు ?**

జ అన్నిసార్లు తేలు కుట్టినా ముని దానిని వదలి పెట్ట లేదు. నెమ్మదిగా ఒడ్డుకు వచ్చి తేలును అక్కడ ఉన్న పొదల్లో వదిలేశారు.

**4. శిష్యులు అడిగిన ప్రశ్నకు ముని ఏమని జవాబు ఇచ్చారు ?**

జ శిష్యులు అడిగిన ప్రశ్నకు ముని 'అది తేలు, దాని ధర్మము కుట్టటం. కాబట్టి అది కుట్టింది. నా ధర్మం ఇతర జీవులను రక్షించడం. కాబట్టి నేను రక్షించాను. ఎవరి ధర్మం వారు పాటిస్తే అందరూ సంతోషంగా ఉండవచ్చు' అని జవాబు ఇచ్చారు.

పాఠం - 7

# గోల్కొండ

**1. గోల్కొండ అసలు పేరు ఏమిటి ?**

జ గోల్కొండ అసలు పేరు గొల్లకొండ. కాలక్రమంలో ఇది గోలకొండ, గోల్కొండ వాడుకలోకి వచ్చింది.

**2. గోల్కొండ కోటకు ఎన్ని బురుజులున్నాయి ?**

జ గోల్కొండ కోటకు 87 బురుజులు ఉన్నాయి.

**3. గోల్కొండ కోటకు ఎన్ని సింహ ద్వారాలు ఉన్నాయి ? వాటిలో కొన్ని పేర్లు రాయండి ?**

జ గోల్కొండ కోటకు ఎనమిది సింహ ద్వారాలు ఉన్నాయి. వాటిలో కొన్ని పేర్లు జమాలీ దర్వాజ, ఫత్తే దర్వాజ, మక్కా దర్వాజ, బంజార దర్వాజ.

**4. రామదాసు బందీఖానా గురించి రాయండి ?**

జ రామదాసు బందీఖానా గోల్కొండలో ఉంది. రామదాసు తాను కట్టించిన రామాలయానికి సర్కారు పైకం వాడినాడన్న అబియోగం పై ఆయనను తానీషా ప్రభువు ఇందులో బంధించాడు.

పాఠం - 8

# చెప్పటం కాదు చేసి చూపాలి

**1. సోము, రాముల మధ్య జరిగిన సంభాషణను వివరించండి ?**

జ సోము, రాములు తమ భవిష్యత్ గురించి ఆలోచించారు. రాము ఉద్యోగం చేయాలనుకున్నాడు. కానీ సోము గేదెలను కొని పాల వ్యాపారం చేయాలనుకున్నాడు.

**2. సోముని వాళ్ల నాన్న ఏ పనికి కుదిర్చాడు ?**

జ సోముని వాళ్ల నాన్న ఎంత చెప్పినా వినకుండ ఒక వ్యాపారి వద్ద పనికి కుదిర్చాడు.

**3. ఈ పాఠ్యాంశం నుండి నీవు గ్రహించిన నీతి ఏమిటి ?**

జ చెప్పటం గొప్ప కాదు, చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టడం గొప్పతనం.

**పాఠం - 9**

# తెలంగాణ గీతం

**1. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని జిల్లాలు ఉన్నాయి ?**

జ తెలంగాణ రాష్ట్రంలో పది జిల్లాలు ఉన్నాయి.

**2. తొలి తెలుగు కవి పేరేమిటి ?**

జ తొలి తెలుగు కవి పేరు పాల్కురికి సోమన.

**3. భద్రాచల రామాలయాన్ని నిర్మించినది ఎవరు ?**

జ భద్రాచల రామాలయాన్ని కంచర్ల గోపన్న నిర్మించాడు.

**4. రామప్ప గుడిని నిర్మించిన పరిపాలకులు ఎవరు ?**

జ రామప్ప గుడిని నిర్మించిన పరిపాలకులు కాకతీయులు.

**5. సర్వజ్ఞ సింగ భూపాలుడు పాలించిన ప్రాంతం రాజధాని పేరేమిటి ?**

జ సర్వజ్ఞ సింగ భూపాలుడు పాలించిన ప్రాంతం రాజధాని రాచకొండ.

**6. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన నదుల పేర్లు రాయండి ?**

జ గోదావరి, కృష్ణా నదులు.

**పాఠం - 10**

# వినాయక చవితి

**1. వినాయక చవితికి ఆ పేరు ఎందుకు వచ్చినది ?**

జ చవితి రోజున ఈ పండుగ జరుపుకుంటారు. కాబట్టి దానికి వినాయక చవితి అని పేరు వచ్చింది.

**2. వినాయకునికి ఉన్న పేర్లు మీకు తెలిసినవి రాయండి?**

జ గజానన, వక్రతుండుడు, ఏక దంతుడు, గణపతి, మూషిక వాహనుడు.

**3. వినాయక పూజలో వాడే 21 రకాల పత్రాలలో కొన్ని పేర్లు రాయండి ?**

జ బిల్వ పత్రం, మారేడు, ఉమ్మెత్త, గరిక, జాజిపత్రి, జిల్లేడు, జమ్మి, రావి, దానిమ్మ, వావిలి, గన్నేరు, మామిడి, ఉత్తరేణి, మర్రి.

**4. వినాయకుడి తమ్ముడి పేరేమిటి ?**

జ వినాయకుడి తమ్ముడి పేరు కుమార స్వామి.

**పాఠం - 11**

# కాలం

**1. క్రియ అంటే ఏమిటి ?**

జ పనిని తెలియ చేసేది క్రియ. పనిని తెలిపే పదాలు క్రియా పదాలు.

**2. క్రియకు ఎన్ని కాలాలు ఉన్నాయి ? వాటి పేర్లు రాయండి ?**

జ క్రియకు మూడు కాలాలు ఉన్నాయి. 1. వర్తమాన కాలం, 2. భూతకాలం, 3. భవిష్యత్ కాలం

**3. వర్తమాన కాలం నిర్వచించండి ?**

జ జరుగుతున్న పనిని గురించి చెప్పేది వర్తమాన కాలం.

**4. భూతకాలం ఏమి చెబుతుంది ?**

జ భూతకాలం జరిగి పోయిన పనిని తెలియ చెబుతుంది.

**5. భవిష్యత్ కాలం అంటే ఏమిటో చెప్పండి ?**

జ రాబోయే కాలంలో జరిగే పనిని తెలిపేది భవిష్యత్ కాలం.

పాఠం - 12

# పూల పండుగ - బతుకమ్మ

1. **బతుకమ్మ పండుగ ప్రతి సంవత్సరం ఏ నెలల్లో వస్తుంది?**

జ బతుకమ్మ పండుగ ప్రతి సంవత్సరం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వస్తుంది.

2. **బతుకమ్మ పేర్చడానికి ఏయే పూలు వాడుతారు ?**

జ బతకమ్మను పేర్చడానికి తంగేడు, బంతి, తామర, గుమ్మడి పువ్వులు, ఆకులు, దోస ఆకులు, పువ్వులు, అల్లి పువ్వులు, గునుగు పువ్వు, కట్లపువ్వులు, టేకు పువ్వులు వాడుతారు.

3. **బతుకమ్మ పండుగ మొదటి రోజును ఏమని పిలుస్తారు ?**

జ బతుకమ్మ పండుగ మొదటి రోజును ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు.

4. **సద్దుల బతుకమ్మ రోజున ఏయే పదార్థాలు తయారు చేస్తారు ?**

జ సద్దుల బతుకమ్మ రోజున మొక్కజొన్నలు, జొన్నలు, నువ్వులు, పల్లీలు, బెల్లం, పాలు, గోధుమలు, బియ్యం లాంటి వాటితో సద్దులను తయారు చేస్తారు. ఈ సద్దులను అందరూ తమ తోటివారితో పంచుకుంటారు.

5. **విజయదశమి పండుగ రోజున పూజించే చెట్టు పేరేమిటి ?**

జ విజయదశమి పండుగ రోజున జమ్మి చెట్టును పూజిస్తారు.

పాఠం - 13

# కొమురం భీం

**1. కొమురం భీం వర్ధంతి ఎప్పుడు నిర్వహిస్తారు ?**

జ కొమురం భీం వర్ధంతిని ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ పౌర్ణమి రోజున జోడేఘాట్‌లో నిర్వహిస్తారు.

**2. కొమురం భీం చదవడం రాయడం ఎక్కడ నేర్చుకున్నాడు?**

జ కోమురం భీం చంద్రాపూర్‌లోని ఒక ప్రింటింగ్ యజమాని వద్ద పని చేస్తునప్పుడు చదవడం, రాయడం నేర్చుకున్నాడు.

**3. కొమురం భీం నిజాంను ఎందుకు ఎదిరించాడు ?**

జ కొమురం భీం కెరిమెరి మండలం బాబేఝరి చుట్టూ ఉన్న 12 గ్రామాల్లోని ఆదివాసులను ఏకం చేశాడు. గ్రామాల అటవీ భూములను వ్యవసాయానికి అనుగుణంగా మార్చి, ఆ భూములకు పట్టాలు ఇవ్వమని నిజాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. దానికి ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో కొమరం భీం నిజాంని ఎదిరించాడు.

**4. నిజాం ప్రభుత్వానికి కొమురం భీం స్థావరం ఎలా తెలిసింది ?**

జ కొమురం భీం అనుచరుడు కుర్దు పటేల్ సహాయంతో నిజాం ప్రభుత్వానికి భీం స్థావరం తెలిసింది.

పాఠం - 14

# అబద్ధంతో అనర్థం

1. **చింటూ ఎలాంటి వాడు?**

జ చింటూ చాలా మొండివాడు. నోటికి వచ్చినట్టు అబద్దాలు ఆడుతూ ఉండేవాడు.

2. **ఒక రోజు టీచర్ బడికి ఎందుకు రాలేదని అడిగితే చింటూ ఏమని అబద్ధం చెప్పాడు ?**

జ బడికి ఎందుకు రాలేదని టీచర్ అడిగితే చింటూ 'మానాన్నగారికి రోడ్డు మీద యాక్సిడెంట్ అయ్యింది టీచర్ ! ఆసుపత్రిలో ఉన్నాం. అందుకే బడికి రాలేదు.' అని అబద్ధం చెప్పాడు.

3. **అడవిలో మేకలు కాసే పిల్లాడు ఏమని అబద్ధం చెప్పాడు?**

జ అడవిలో మేకలు కాసే పిల్లాడు 'నాన్న పులి... నాన్న పులి' అని అబద్ధం చెప్పాడు.

4. **పిల్లాడు నిజం చెప్పినా పొలంలో పని చేసుకునే వారు ఎందుకు నమ్మలేదు?**

జ పిల్లాడు తమాషా చేస్తున్నాడని పొలంలో పని వారు అనుకున్నారు. అందుకే పిల్లాడు నిజంగా పులి వచ్చిందని చెప్పినా వారు నమ్మలేదు.

5. **వార్షిక పరీక్షల పమయంలో చింటూ టీచర్ కు ఏమని చెప్పాడు ?**

జ వార్షిక పరీక్షల సమయంలో చింటూ టీచర్‌కు మా నాన్నకు యాక్సిడెంట్ అయ్యిందని చెప్పాడు.

6. **చివరకు చింటూ ఏమని నిర్ణయించుకున్నాడు ?**

జ చివరకు చింటూ ఇకపై తన జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకూడదని నిర్ణయించు కున్నాడు.

పాఠం - 18

# యాదగిరి గుట్ట

**1. యాదగిరి గుట్ట ఎక్కడ ఉంది ?**

జ యాదగిరి గుట్ట నల్లగొండ జిల్లాలో ఉంది. హైదరాబాద్ కు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది.

**2. యాదగిరి గుట్టపై ఎవరు తపస్సు చేశారని చెబుతారు?**

జ యాదగిరి గుట్ట పై యాదర్షి తపస్సు చేశారని చెబుతారు.

**3. యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామికి ఉన్న ఇతర పేర్లు రాయండి ?**

జ యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామికి జ్వాలా నరసింహా, యెగ నరసింహా, గండ బేరుండ నరసింహా అని పేర్లు ఉన్నాయి.

పాఠం - 17

# నానమ్మ చెప్పిన కథ

1. **నల్లబంగారం అని వేటిని పిలిచేవారు ?**

జ మిరియాలను నల్ల బంగారం అని పిలిచేవారు.

2. **నంది గుప్తుడు ఏమి చేసేవాడు ?**

జ నంది గుప్తుడు సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేసేవాడు. కేరళ నుంచి సుగంధ ద్రవ్యాలను టోకుగా కొనుగోలు చేసి వాటిని ఇతర దేశాల్లో అమ్మేవాడు.

3. **నంది గుప్తుడు ధనగుప్తుడికి ఎలా గురువైపోయాడు?**

జ నందిగుప్తుడు ధనగుప్తుడికి వ్యాపారంలోని మెళకువలన్నీ చెప్పేశాడు. అతనికి మంచి లాభాలు వచ్చేలా చేశాడు. ప్రతిఫలంగా ఏమీ తీసుకోలేదు. దాంతో నందిగుప్తుడు ధనగుప్తుడికి గురువైపోయాడు.

4. **ధనగుప్తుడి నౌక ప్రమాదానికి గురైనప్పుడు నంది గుప్తుడు ఏం చేశాడు ?**

జ ధనగుప్తుడి నౌక ప్రమాదానికి గురైనప్పుడు అతని విన్నపాన్ని పట్టించుకోలేదు. ధన గుప్తుడు నౌకను తన అనుచరుల సహాయంతో సముద్ర జలాల్లో ముంచి వేశాడు.

5. **ఈ కథలో ఉన్న నీతి గురించి రాయండి?**

జ బలవంతులకు, సంపన్నులకు అడక్కుండానే అందరూ సహాయపడతారు. బలహీనులకు అడిగినా సహాయం చేయరు.

పాఠం - 18

# జాతీయ పక్షి నెమలి

**1. నెమలిని ఎన్ని జాతులుగా వర్గీకరించారు ?**

జ నెమలిని మూడు ఉపజాతులుగా వర్గీకరించారు. అవి 1. పావోక్రిస్టేటస్ 2. పావోమ్యూటికస్ 3. ఆఫ్రోపావో కాంగోలెన్సిస్.

**2. నెమలి సాధారణంగా ఏ ఆహారాన్ని తీసుకుంటుంది ?**

జ నెమలి శాకాహారం, మాంసాహారం రెండింటినీ ఆహారంగా తీసుకుంటుంది. సాధారణంగా నెమలి పూలరేకులు, మొక్క భాగాలు, విత్తనాలు, మొలకలు, కీటకాలు, అప్పుడప్పుడు బల్లి లాంటి సరీసృపాలను, కప్పలు లాంటి ఉభయ చరాలను ఆహారంగా స్వీకరిస్తుంది.

**3. మగ నెమలికి ఆడనెమలికి గల తేడా ఏమిటి ?**

జ మగనెమలికి అందమైన ఈకలు ఉంటాయి, ఆడనెమలికి ఇవి ఉండవు. ఆడనెమలికి తల పైన ఆకుపచ్చ, గోధుమ, బూడిద రంగులో ఫించం ఉంటుంది.

**4. మన జాతీయ పక్షి నెమలి. మరి మన రాష్ట్ర పక్షి పేరేమిటి ? దాని గురించి కొన్ని వాక్యాలు రాయండి ?**

జ మన రాష్ట్ర పక్షి పాలపిట్ట. దసరా పండగ రోజున తప్పని సరిగా పాలపిట్టను దర్శిస్తారు. దాన్ని శుభ సూచకంగా భావిస్తారు.

పాఠం - 19

# రైతుదే

1. **దాశరథి ఎవరిని ధిక్కరిస్తూ పద్యాలు రాశాడు?**

జ దాశరథి నిజామును ధిక్కరిస్తూ పద్యాలు రాశాడు.

2. **తెలంగాణము ఎవరిది?**

జ ప్రాణాలకు లెక్క చేయక అడవులను పొలాలుగా సృష్టించి, రెక్కలు ముక్కలు చేసుకుని దాన్ని నవాబు ఖజానాలో బంగారం నింపిన రైతుదే తెలంగాణము.

3. **రైతు నిజాము భోషాణములను ఎట్లా నింపాడు ?**

జ ఎముకలను పొడి చేసుకుని పొలాలను దున్ని రైతు నిజాము భోషాణములను బంగారంతో నింపాడు.

4. **తెలంగాణను నిజాము ఏం చేశాడని కవి భావము ?**

జ తెలంగాణ కోటి రతనాల వీణ. ఆ వీణ తీగలను నిజాము తెంపి నిప్పులో పడేశాడని కవి భావము.

**పాఠం - 21**

# విశేషణము

**1. విశేషణము ఏమి తెలియ జేస్తుంది ?**

జ విశేషణము నామవాచకం రంగు, గుణము, పరిమాణము, సంఖ్యను తెలియజేస్తుంది.

**2. కొన్ని విశేషణాలను రాయండి ?**

జ తీయని, పుల్లని, నెమ్మదిగ, పొడవుగా, వెచ్చని, తెల్లని.

పాఠం - 22

# మదన్ మోహన్ మాలవ్య

**1. మదన్ మెహన్ మాలవ్య ముందుగ ఏ ఉద్యోగం చేశారు ?**

జ మదన్ మెహన్ మాలవ్య ముందుగా ఉపాధ్యాయ ఉద్యోగం చేశారు.

**2. మదన్ మోహన్ మాలవ్య గొప్పన్యాయ వాదిగా నిలబెట్టిన సంఘటన గురించి రాయండి ?**

జ మదన్ మోహన్ మాలవ్య చౌరా చౌరా సంఘటనలో ఉరిశిక్ష పడిన ఖైదీల తరపున వాదించారు. ఈ కేసులో 156 మందిని నిర్దోషులుగా విడిపించారు. ఇది అతనికి న్యాయవాద వృత్తిలో మంచి పేరు తెచ్చి పెట్టింది.

**3. మదన్ మోహన్ మాలవ్య ఏయే పత్రికలకు సంపాదకులుగా పని చేశారు ?**

జ మదన్ మోహన్ మాలవ్య హిందుస్థాన్ హిందీ మాస పత్రిక, హిందుస్థాన్ టైమ్స్ దిన పత్రికలకు సంపాదకులుగా పని చేశారు.

**4. మదన్ మోహన్ మాలవ్య చేసిన సంఘ సంస్కరణల గురించి రాయండి ?**

జ మదన్ మోహన్ మాలవ్య బాల్యవివాహాలను నిరసించారు. వితంతు వివాహాలు చేయించారు. దళితులకు ఆలయ ప్రవేశాలు చేయించారు. దళిత వాడల్లో సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. మద్యం తాగడాన్ని వ్యతిరేకించారు.

పాఠం - 23

# బోనాలు

**1. బోనాల పండుగనాడు ఏం చేస్తారు ?**

జ బోనాల పండుగనాడు ప్రజలు తన ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. దేవతల గుళ్లకు సున్నం, జాజు పూస్తారు. రంగులతో అలంకరిస్తారు. వేపాకు మండలతో తీర్చి దిద్దుతారు. కొత్తకుండలో 'బోనం' తయారుచేసి గుడికి తీసుకు వెళతారు. దేవతకు పూజలు చేసి బోనం సమర్పించి ఇంటికొస్తారు. బోనం బువ్వను ప్రసాదంగా తీసుకుంటారు.

**2. తెలంగాణ ప్రజలు గ్రామ దేవతలను దేనికి ప్రతీకలుగా భావిస్తారు ?**

జ తెలంగాణ ప్రజలు గ్రామ దేవతలను అమ్మదేవతలుగా భావిస్తారు.

**3. బోనం అంటే ఏమిటి ? ఎట్లా చేస్తారు బోనం ?**

జ బోనం అంటే భోజనం, దీని కోసం కొత్తకుండను తెచ్చి అందులో అన్నం వండుతారు. కుండను అలంకరించి దానిపైన దీపం వెలిగిస్తారు. తర్వాత దాన్ని తలపైన పెట్టుకుని గుడికి తీసుకు వెళతారు.

**4. అమ్మ దేవతలలో కొందరి పేర్లు రాయండి ?**

జ పోషమ్మ, మైసమ్మ, బాలమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, చౌడలమ్మ, గండమ్మ ఈ దెమ్మ, ముత్యాలమ్మ, ఉప్పలమ్మ, కట్టెమ్మ.

లయోల

# తెలుగు వాచకం

## 5వ తరగతి

## ప్రశ్నలు - జవాబులు




రచన, సంపాదకత్వం

భోగా నాగభూషణం శాలి



ప్రచురణ

లయోలా పబ్లికేషన్స్

హైదరాబాద్

పాఠం - 2

# ఎండు ఖర్జూరాలు

**1. విశ్వనాథం ఎక్కడ నివాసం ఏర్పరుచుకున్నాడు ?**

జ. విశ్వనాథం నెమలి కన్ను గ్రామంలో గ్రామపెద్దల అనుమతితో గ్రామంలోని రామాలయం సత్రంలో నివాసం ఏర్పరుచుకున్నాడు.

**2. విశ్వనాథన్ని గ్రామస్తులు ఎందుకు గౌరవించేవారు ?**

జ విశ్వనాథం అందరినీ ఎంతో ప్రేమగా పలకరించేవాడు. గ్రామస్తులందరికీ తలలో నాలుకై పోయాడు. దాంతో అందరు అతన్ని గౌరవించేవారు.

**3. విశ్వనాథం గ్రామ ప్రజల కోసం ఏమేం చేశాడు ?**

జ విశ్వనాథం గ్రామ ప్రజల కోసం వైద్యం చేశాడు. హరికథలు చెప్పాడు, వయోజనులకు అక్షరాలు నేర్పించాడు. నలుగురికి మంచి చెబుతూ కష్టాల్లో ఉన్నవారిని ఓదార్చాడు. భవిష్యత్తు వివరిస్తు జోతిష్యం చెప్పాడు.

**4. విశ్వనాథం శిష్యుడు శరభలింగం ఎలాంటి వాడు?**

జ విశ్వనాథం శిష్యుడు శరభలింగం దుష్ట బుద్ధి కలవాడు.

**5. విశ్వనాథం మరణించినప్పుడు తన గురువు గురించి శరభలింగం ఏమని చెప్పాడు ? చివరికి గ్రామ ప్రజలు ఏం చేశారు ?**

జ విశ్వనాథం మరణించినపుడు శరభలింగం గురువునే అనుమానించాడు. విశ్వనాథం అన్యాయంగా ఈ సొమ్మును సంపాదించాడని పుకారు లేవదీశాడు. గ్రామస్తులెవరూ ఈ వదంతిని నమ్మలేదు. పైగా ఇలా ప్రచారం చేసినందుకు శరభలింగాన్ని చితక బాదారు.

పాఠం - 3

# ఉట్ల పండుగ

**1. శ్రీ కృష్ణాష్టమి రోజును ఏమని పిలుస్తారు ?**

జ శ్రీ కృష్ణాష్టమి రోజును 'ఉట్ల పండుగ' అని పిలుస్తారు.

**2. ఉట్ల పండుగ రోజు స్త్రీలు ఏమేమి చేస్తారు ?**

జ ఉట్ల పండుగ రోజు స్త్రీలు తమ ఇంటి ముందు చిన్న పాదముద్రలు వేసి చిన్ని కృష్ణుడిని ఆహ్వానిస్తారు. బాలకృష్ణుని బొమ్మను ఊయలలో వేసి 'జో అచ్యుతానంద జో జో ముకుందా, లాలి పరమానంద రామగోవింద' అంటూ జోల పాటలు పాడుతారు.

**3. మట్టికుండలో ఏమేం కలిపి ఉంచుతారు ?**

జ ఉట్టి కొట్టే మట్టి కుండలో పెరుగు, అటుకులు కలిపి ఉంచుతారు.

**4. ఉట్టి కొట్టిన తర్వాత ఏం చేస్తారు ?**

జ ఉట్టి కుండను పగలగొట్టిన తర్వాత అందులో మిగిలిన పెరుగు, అటుకులను ప్రసాదంగా స్వీకరిస్తారు. కుండ పెంకులను ఇంటికి తీసుకు వెళతారు.

**5. శ్రీ కృష్ణాష్టమి, శ్రీకృష్ణునికి ఉన్న సంబంధం ఏమిటో వివరించండి ?**

జ శ్రీ కృష్ణుడు అష్టమి రోజున జన్మించాడు. ఈరోజున జరుపుకునే పండుగను 'శ్రీ కృష్ణాష్టమి' అంటారు.

పాఠం - 4

# ప్రజాకవి కాళోజి

**1. కాళోజి పూర్తి పేరేమిటి ?**

జ. కాళోజి పూర్తి పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రామ్‌రాజా కాళోజి.

**2. కాళోజికి కన్నడం, మరాఠీ భాషలు ఎలా అలవడ్డాయి ?**

జ. కాళోజి తల్లి మాతృభాష కన్నడం, తండ్రి భాష మరాఠీ. ఈ కారణంగా కాళోజికి కన్నడం, మరాఠీ భాషలు అలవడ్డాయి.

**3. కాళోజి చిన్నతనంలో ఎలా ఉండేవారు ?**

జ. కాళోజి చిన్నప్పటి నుండి ప్రతిదీ అడిగి తెలుసుకునే వారు. చెడుపనులను వ్యతిరేకించే వారు.

**4. కాళోజి మొట్టమొదటి కవితా సంకలనం పేరేమిటి ?**

జ. కాళోజి మొట్టమొదటి కవితా సంకలనం పేరు 'నా గొడవ'.

**5. కాళోజిని ప్రజాకవి అని ఎందుకు అన్నారు ?**

జ. కాళోజి తన చుట్టు జరిగిన సంఘటనలు ప్రేరణగా తీసుకుని కవిత్వం రాశారు, తన జీవిత అనుభవాన్ని కవితలుగా మలిచారు. సులభ శైలిలో, సామాన్య ప్రజల జీవితంలోని అన్ని పార్శ్వాలను కవితా రూపంలో అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. అందుకే ఆయనను ప్రజాకవి అన్నారు.

**6. కాళోజి జరిపిన పోరాటాల గురించి వివరించండి ?**

జ. కాళోజి రజాకార్ వ్యతిరేక ఉద్యమంలో పోరాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం కాళోజి హైదరాబాద్ నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. రజాకార్ల పాశవిక మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పౌర హక్కుల పోరాటాలలోను కాళోజి క్రియాశీల పాత్ర పోషించారు.

పాఠం - 5

# ఆకు కూరలు

**1. ఆకు కూరలను ఎందుకు తేలిక భావంతో చూస్తున్నాము ?**

జ ఆకు కూరలు చౌకగా లభిస్తాయి. అందుకే వాటిని తేలిక భావంతో చూస్తున్నాము.

**2. మన శరీరంలోని రక్షణ వ్యవస్థ పరిపుష్టి కావాలంటే ఏమి చేయాలి ?**

జ మన శరీరంలోని రక్షణ వ్యవస్థ పరిపుష్టి కావాలంటే విటమిన్లు, ఖనిజ లవణాలు ఆహారంలో తగిన మోతాదులో తీసుకోవాలి. ఇవి ఆకు కూరలలో లభిస్తాయి.

**3. ఆకు కూరల్లో ఏమేమి ఉన్నాయి?**

జ ఆకు కూరల్లో పీచు పదార్థం ఉంటుంది. విటమిన్లతో పాటు ఖనిజలవణాలు ఆకు కూరల్లో లభిస్తాయి.

**4. ఆకు కూరల గురించి భారతీయ వైద్య పరిశోధనా మండలి ఏం చెప్పింది ?**

జ ఆకు కూరల గురించి భారతీయ వైద్య పరిశోధనా మండలి ప్రతి మనిషి ప్రతిరోజు 50 గ్రాములకు తగ్గకుండ ఆకు కూరలు తీసుకోవాలని చెప్పింది.

**5. ఆకు కూరలలోని ఖనిజ లవణాల ఉపయెగం గురించి రాయండి ?**

జ ఆకు కూరలలో ఉన్న ఖనిజ లవణాలు రక్తంలో కలిసి కండరాలు చెడిపోకుండా కాపాడుతాయి. జీవ రసాయనిక చర్యలలో ప్రేరకాలుగా పని చేస్తాయి.

**6. ఆకు కూరలలోని పీచు పదార్థం ఉపయోగాలు రాయండి ?**

జ ఆకు కూరల లోని పీచు పదార్థం మలబద్ధకం, కోలాన్ కాన్సర్, మొలలు లాంటివి రాకుండా కాపాడుతుంది.

పాఠం - 7

# విక్రమార్కుని ఔదార్యం

**1. రత్నాల వ్యాపారి విక్రమార్క మహారాజును ఏమని అడిగాడు ?**

జ. రత్నాల వ్యాపారి విక్రమార్క మహారాజుని 'మహా రాజా, నేనొక రత్నాల వ్యాపారిని. నా దగ్గర ఐదు రత్నాలు ఉన్నాయి. వాటిని మీరు పరిశీలించి తగిన ధర నిర్ణయించి తీసుకోండి' అని అడిగాడు.

**2. ధనం ఇచ్చిన తర్వాత రత్నాల వ్యాపారి మళ్లీ ఏం చెప్పాడు ?**

జ. ధనం ఇచ్చిన తర్వాత రత్నాల వ్యాపారి 'మహారాజా, ఇలాంటివి ఇంకా పది రత్నములు మా ఊరిలోని నా ఇంట్లో ఉన్నాయి. మా ఊరు ఇక్కడకు పది ఆమడల దూరంలో ఉంది. నమ్మకస్తుడైన ఒక భటుని నాతో పంపిస్తే ఆ రత్నాలను పంపుతాను' అని చెప్పాడు.

**3. తనకు అడ్డగించిన నావికునికి రాజభటుడు ఏమి ఆశ చూపాడు ?**

జ. తనను అడ్డగించిన నావికునికి రాజభటుడు 'నీకొక వరహా ఇస్తాను' అని ఆశ చూపాడు.

**4. నావికుడు రాజుతో ఏమని చెప్పాడు ?**

జ. నావికుడు రాత్రి భటుని దగ్గర వసూలు చేసిన ఐదు రత్నాలను మహారాజు ముందు ఉంచి. 'తమ సేవకుని గుణం పరీక్షించడానికి నేను అలా చేశాను. నా తప్పు క్షమించండి.' అని చెప్పాడు.

పాఠం - 9

# గుడ్డి నమ్మకం

**1. సింహంతో స్నేహం చేయడానికి నక్క ఏం చేసింది ?**

జ సింహంతో స్నేహం చేయడానికి నక్క చిన్న, పెద్ద జంతువులకు మాయమాటలు చెప్పి సింహం దగ్గరకు తీసుకు వెళ్లి ఆహారంగా అందించేది.

**2. మేకను నమ్మించడానికి నక్క ఏమని చెప్పింది ?**

జ మేకను నమ్మించడానికి నక్క తాను మేకలమంద, ఆ మందకు కాపలా మనిషిని చూశానని చెప్పింది. 'మంద అడుగులు ఎటు వైపు నడిచింది చూస్తే దారి దొరుకుతుంది. నువ్వు నాతో రా, నేను అక్కడకి తీసుకు వెళతాను' అని చెప్పింది.

**3. నక్క మాటలు నమ్మిన మేక ఏమైపోయింది ?**

జ నక్క మాటలు నమ్మిన మేక సింహానికి ఆహారంగా మారిపోయింది.

**4. ఈ కథలో ఉన్న నీతి గురించి రాయండి ?**

జ ఎవరినైనా సరే గుడ్డిగా నమ్మకూడదు. నమ్మితే ప్రాణాల మీదకు వస్తుంది.

పాఠం - 10

# మేడారం జాతర

**1. మేడారం జాతర ఎన్నేళ్లకు ఒక సారి జరుగుతుంది ? ఎన్ని రోజులు జరుగుతుంది ?**

జ మేడారం జాతర రేండేళ్లకు ఒకసారి జరుగుతుంది. పది రోజులు జరుగుతుంది.

**2. మేడారం జాతరలో కొలిచే దేవతల పేర్లు రాయండి ?**

జ మేడారం జాతరలో కొలిచే దేవతలు సమ్మక్క, సారలమ్మ.

**3. జాతరకు ముందు జరిగే ప్రారంభ కార్యక్రమాన్ని ఏమని పిలుస్తారు ?**

జ జాతరకు ముందు జరిగే ప్రారంభ కార్యక్రమాన్ని 'మండె మెలిగె పండుగ' అని అంటారు.

**4. సమ్మక్క, సారలమ్మ దేవతలకు నైవేద్యంగా భక్తులు ఏమి సమర్పిస్తారు ?**

జ సమ్మక్క, సారలమ్మ దేవతలకు నైవేద్యంగా భక్తులు బంగారం పేరతో బెల్లాన్ని సమర్పిస్తారు.

**5. ప్రతాపరుద్రుడి సైన్యం పగిడిద్ద రాజుపై ఎందుకు దాడి చేసింది ? దాడిలో ఏం జరిగింది ?**

జ ప్రతాపరుద్రుడి కాలంలో తీవ్రమైన కరువు వచ్చింది. అప్పుడు మేడారం ప్రాంతాన్ని పరిపాలించే పగిడిద్ద రాజు కప్పం కట్టలేక పోయాడు. దాంతో ప్రతాపరుద్రుడి సైన్యం దాడికి దిగింది. దాడిలో ప్రతాప రుద్రుడి సైన్యం పగిడిద్ద రాజును ఎదుర్కోలేకపోయింది. దాంతో సెన్యం దొంగచాటుగా పగిడిద్ద రాజు భార్య సమ్మక్కను, కూతురు సారలమ్మను చంపేసింది.

పాఠం - 11

# పల్లెటూరి పిల్లగాడ

**1. పల్లెటూరి పిల్లగాడు ఎవరు ? పల్లవిని చదివి రాయండి ?**

జ ఆవులు, బర్రెలు కాయడానికి భూస్వామి దగ్గర జీతానికి పనిచేసే అబ్బాయి పల్లెటూరి పిల్లగాడు.

**2. పాల బుగ్గల జీతగాడు ఏం తొడుక్కున్నాడు? ఏం కప్పుకున్నాడు ?**

జ పాల బుగ్గల జీతగాడు చాలీచాలని చింపుల అంగి తొడుక్కున్నాడు. ఎండ తగలకుండ గోనె చింపును కొప్పెరలాగా కప్పుకున్నాడు.

**3. పాల బుగ్గల జీతగాడు ఎందుకు అదలిపోయాడు ?**

జ పాల బుగ్గల జీతగాడు పనిచేసే చోట సమయానికి అన్నం పెట్టక పోయేవారు. పొద్దున్నే వాళ్లమ్మ పెట్టే సద్దికూడు తినే అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆకలితో అదలిపోయాడు.

**4. పసులు కాసే మొనగాణ్ని ఎవరెందుకు కొట్టారు ?**

జ ఆవు దూడలు అటు ఇటు పరుగెత్తేవి. మళ్లీ మళ్లీ కంచె దూకి పంట చేలల్లోకి వెళ్లి పాడు చేసేవి. దాంతో పాలికాపు పసులు గాసే మొనగాణ్ని కొట్టాడు.

పాఠం - 12

# టెన్నిస్ తార సానియా మీర్జా

**1. సానియా మీర్జా జన్మస్థలం ఎక్కడ ? ఆమె తల్లిదండ్రులెవరు ?**

జ సానియా మీర్జా హైదరాబాద్‌లో జన్మించింది. ఆమె తల్లి నసియా, తండ్రి ఇమ్రాన్ మీర్జా.

**2. సానియా మీర్జా విద్యాభ్యాసం ఎక్కడ జరిగింది ?**

జ సానియా మీర్జా విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే జరిగింది. నాసర్ పాఠశాలలో చదువుకున్న ఆమె సెయింట్ మేరీ కళాశాల నుంచి పట్టభద్రురాలైంది.

**3. సానియా మీర్జా సాధించిన విజయాలు ఏమిటి ?**

జ సానియా మీర్జా తన 17వ ఏటనే 2003లో అంతర్జాతీయ టెన్నిస్‌లోకి అడుగు పెట్టింది. ఏప్రిల్ 2006లో సానియా మీర్జా భారత ఫెడరేషన్ కప్ జట్టులో అడుగుపెట్టి తొలి మూడు సింగిల్ మ్యాచ్‌లలో జట్టుకు విజయాలు సాధించి పెట్టింది. ఇదే సంవత్సరం వింబుల్డన్ ఛాంపియన్ షిప్ బాలికల డబుల్స్ టైటిల్ గెలుచుకుంది. 2004లో ఆమెను భారత ప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది. సానియా మీర్జా గ్రాండ్ స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌తో సీడ్ పొందిన తొలి భారత మహిళగా రికార్డు సృష్టించింది. 2006లో ఆమెకు 'పద్మశ్రీ' పురస్కారం లభించింది. 2008లో చెన్నైలోని ఎం.జి.ఆర్ విశ్వ విద్యాలయం సానియా మీర్జాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2014వ సంవత్సరంలో ఆమెను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కార్త' గా నియమించింది.

**పాఠం - 13**

# వాక్య నిర్మాణం

**1. వాక్యం అంటే ఏమిటి?**

జ అర్థవంతమైన మాటలు కూర్పు వాక్యం.

**2. కర్త అంటే ఏమిటో తెలియ జేసి, రెండు ఉదాహరణలిమ్ము ?**

జ పని చేస్తున్న దానిని తెలియ చేసేది కర్త,

ఉదా:- 1. వెంకటేశ్వర్లు బడికి వెళ్లాడు. ఇందులో వెంకటేశ్వర్లు కర్త.

2. ఈ రోజు బడి లేదు, ఈ వాక్యంలో బడి కర్త.

**3. కర్మ అంటే ఏమిటి? ఉదాహరణలతో తెలపండి ?**

జ కర్త చేస్తున్న ఫలితాన్ని అనుభవించేది కర్మ.

ఉదా:- 1. శ్రీలత పాట పాడింది. ఇందులో పాడింది కర్మ.

2. శ్రీనివాస్ హోమ్‌వర్క్ పూర్తి చేశాడు. ఇందులో పూర్తి చేశాడు కర్మ.

**4. కర్త, కర్మ లేని రెండు వాక్యాలు రాయండి ?**

జ 1. అది పాఠశాల.

2. ఇది ఊరు.

పాఠం - 14

# స్నేహితురాలికి లేఖ

**1. రాజేశ్వరి కాళ్లతో ఏం రాస్తున్నది ?**

జ రాజేశ్వరి కాళ్లతో కవిత్వం రాస్తున్నది .

**2. రాజేశ్వరి ఎన్నో తరగతి వరకు చదివింది ?**

జ రాజేశ్వరి 7వ తరగతి వరకు చదువుకుంది. తన కాళ్లతోనే పరీక్షలు రాసింది.

**3. రాజేశ్వరిలో మెచ్చేగుణం ఏముంది ?**

జ రాజేశ్వరి తను నిస్సహాయ స్థితిలో ఉండి కూడ పట్టుదలతో రచనలు చేయడం మొదలు పెట్టింది. ఆమెకు ఆత్మ విశ్వాసం ఎక్కువ.

**4. రాజేశ్వరిని ఎవరు సత్కరించారు ?**

జ రాజేశ్వరిని 'సిరిసిల్ల సాహితీ సమితి' సత్కరించింది.

**పాఠం - 15**

# సుద్దాల హనుమంతు

1. **సుద్దాల హనుమంతు ఎప్పుడు ఎక్కడ జన్మించారు?**

జ సుద్దాల హనుమంతు 1910 సంవత్సరంలో నల్లగొండ జిల్లా ఆత్మకూరు మండలం పాలడుగులో జన్మించారు.

2. **సుద్దాల హనుమంతు తల్లిదండ్రుల పేరేమిటి ?**

జ సుద్దాల హనుమంతు తల్లి లక్ష్మీనర్సమ్మ, తండ్రి బుచ్చిరాములు.

3. **సుద్దాల హనుమంతు విద్యాభ్యాసం ఎట్లా జరిగింది?**

జ సుద్దాల హనుమంతు పాలడుగులో చదువుకున్నాడు. తాను చేరిన కానిగి బడిలో పంతుళ్లు వేసే కోదండాలు, కోళ్ల గుది లాంటి శిక్షలు చూసి భయపడి చదువు మానేశాడు. కానీ అక్కడకి వచ్చిన ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో తిరిగి బడిలో చేరాడు.

4. **సుద్దాల హనుమంతును కళాకారునిగా తీర్చిద్దినది ఎవరు?**

జ సుద్దాల హనుమంతును కళాకారునిగా తీర్చిదిద్దినది ఆత్మకూరు అంజయ్య అనే హరికథా కళాకారుడు.

5. **సుద్దాల హనుమంతు ఉద్యోగ జీవితం గుర్చి రాయండి ?**

జ సుద్దాల హనుమంతు వ్యవసాయ శాఖలో ఉద్యోగం చేశాడు. ఢిల్లీ, ఆగ్రా, ఔరంగాబాద్, మద్రాసు లాంటి నగరాలను చూశాడు. ఉద్యోగకాలంలో బుద్వేల్‌లో ఉన్నాడు. ఆర్య సమాజంలో చేరాడు. ఇది పై అధికారులకు నచ్చలేదు. మందలించారు. దాంతో సుద్దాల హనుమంతు తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు.

6. **బరువంతులోల్లు అంటే ఎవరు ?**

జ నిజాం ప్రభుత్వంలో పని చేసే ఉద్యోగులకు సామాను మోయడానికి పనివాళ్లు ఉండేవాళ్లు. వీరు ఏమీ తీసుకోకుండా పని చేసేవాళ్లు, వీరినే 'బరువంతులోల్లు' అనేవారు.

**7. సుద్దాల హనుమంతు ప్రదర్శించిన కళారూపాలేవి ?**

**జ.** విచిత్ర వేశాలు, గొల్లసుద్దులు, లత్కోరుసాబ్, బుడ బుక్కలు, ఫకీరుసాబ్, సాధువేషం.

**8. సుద్దాల హనుమంతు రాసిన పాటల్లో కొన్నింటిని పేర్కొనండి ?**

**జ** ప్రజా ప్రభుత్వం సాధిస్తాం, రణభేరి మ్రోగుతున్నది తెలుగోడా, చిందొర, పెద్దొర వెట్టి చాకిరి విధానమో రైతన్న, నైజాము సర్కారురా ఓరన్న, వెయర వెయ్ దెబ్బకు దెబ్బ.

**9. సుద్దాల హనుమంతుకు పేరు తెచ్చిన పాట ఏది ?**

**జ** 'పల్లెటూరి పిల్లగాడా, పసులు కాసే మొనగాడా' పాట సుద్దాల హనుమంతుకు పేరు తెచ్చి పెట్టింది.

పాఠం - 16

# పోతన పద్యాలు

**1. పోతన ఎవరిని శరణు వేడుకుంటానన్నాడు ?**

జ ఈ విశ్వం ఎవరి కారణంగా పుడుతుందో, ఎవరిలోపల లీనమై ఉంటుందో, ఎవరిలో లయమై పోతుందో, ఆ పరమేశ్వరుడిని శరణు వేడుకుంటున్నానన్నాడు.

**2. స్వరము తానేయైన వాడెవ్వడు ?**

జ సర్వము తానేయైన వాడు స్వయంభువుడైన ఈశ్వరుడు.

**3. పోతనలో భాగవతాన్ని పలికించినది ఎవరు ?**

జ పోతనతో భాగవతాన్ని పలికించినది శ్రీరామచంద్ర ప్రభువు.

**4. ఆత్మభవుడంటే ఎవరు ?**

జ ఆత్మభవుడు అంటే ఈశ్వరుడు.

పాఠం - 17

# ఇబ్రహీం కులీకుతుబ్‌షావలీ

**1. ఇబ్రహీంకుతుబ్‌షా వలీ ఏ సమయంలో తెలుగు భాషపై అభిమానాన్ని పెంచుకున్నాడు ?**

జ ఇబ్రహీం కుతుబ్‌షా వలీ విజయ నగరంలో ప్రవాస జీవితాన్ని గడిపినప్పుడు తెలుగు భాషపై అభిమానాన్ని పెంచుకున్నాడు.

**2. కుతుబ్‌షాహీ పాలకులు పర్షియన్‌తో పాటు ఇంకా ఏ భాషలను ప్రోత్సహించారు ?**

జ కుతుబ్‌షా పాలకులు పర్షియన్‌తో పాటు తెలుగు, ఉర్దూ భాషలను ప్రోత్సహించారు.

**3. అద్దంకి గంగాధరుడు ఇబ్రహీం కులీకి అంకితమిచ్చిన ప్రబంధ కావ్యం పేరేమిటి ?**

జ అద్దంకి గంగాధరుడు ఇబ్రహీం కులీకి అంకితమిచ్చిన ప్రబంధ కావ్యం పేరు తపతీ సంవరణోపాఖ్యానము.

**4. ఇబ్రహీం కులీని తెలుగు కవులు ఏయే పేర్లతో పిలిచేవారు ?**

జ ఇబ్రహీం కులీని తెలుగు కవులు మల్కిభరాము, అభిరామ పేర్లతో పిలిచేవారు.

**5. మీరు చూసిన గొల్కొండ కోట గురించి సొంత వాక్యాల్లో రాయండి?**

జ గోల్కొండ కోట హైదరాబాద్ నగరంలో ఉంది. కోటకు ఎన్నో బురుజులు ఉన్నాయి. ఈ కోటకు చుట్టూ ఎనిమిది సింహ ద్వారాలు ఉన్నాయి. గోల్కొండ కోటలో రామదాసు బంధీఖానా ఉంది. కోట పై భాగంలో బాల హిస్సారు ఉంది. ఇక్కడకి వెళ్లే దారిలో అమ్మవారి గుడి ఉంది. ప్రతి ఏడాది ఇక్కడ ఆషాడ మాసంలో జాతర జరుగుతుంది.

పాఠం - 18

# రాచకొండ

**1. రాచకొండ రాజధానిగా పరిపాలించినది ఎవరు ?**

జ రాచకొండ రాజధానిగా పద్మనాయకులు పరిపాలించారు.

**2. పద్మనాయక రాజులు ప్రజా సంక్షేమం కోసం ఏం చేశారు ? కొన్ని ఉదాహరణలు ఇవ్వండి ?**

జ పద్మనాయక రాజులు ప్రజా సంక్షేమం కోసం తమ పరిపాలనా కాలంలో చెరువులు, కుంటలు, బావులు నిర్మించి వ్యవసాయ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. అనపోతనాయుడు తనపేరుతో అనపోత సముద్రం, రాయ సముద్రం అనే చెరువులను తవ్వించాడు. దేవలమ్మ నాగారం గ్రామంలో నాగ సముద్రం పేరుతో చెరువు నిర్మించారు.

**3. పద్మనాయకుల సాహితీ సేవ గురించి రాయండి ?**

జ పద్మనాయకులు సాహితీ ప్రియులు. స్వయంగా కవులు. సాహిత్య ప్రక్రియలన్నింటిలో నిష్ణాతులు. వీరి పాలనా కాలంలో తెలుగులో రామాయణ రచన జరిగింది. రెండవ సింగభూపాలుడికి సాహిత్యంలో మంచి ప్రవేశం ఉంది. ఆయనకు 'సర్వజ్ఞ' అనే బిరుదు ఉంది.

**4. రాచకొండలో ఉన్న ఆలయాల గురించి వివరించండి ?**

జ రాచకొండలో ఎన్నో ఆలయాలున్నాయి. అవి శిధిలావస్థలో ఉన్నాయి. రాచకొండ కోట దిగువన రామాలయం ఉంది. ఇక్కడ ప్రతి ఏడాది కాళ్యాకోత్సవం నిర్వహిస్తారు.

**5. రాచకొండ పరిసరాల్లో ఆదిమానవుని ఆనవాళ్ల గురించి చెప్పండి ?**

జ రాచకొండ పరిసరాల్లో ప్రాచీన కాలానికి చెందిన గుహలు ఉన్నాయి. వాటిపై ఆదిమ మానవులు చిత్రించిన రేఖా చిత్రాలు ఉన్నాయి. రాచకొండ సమీపంలోని పీపల్ పహడ్ గ్రామం శివారులో తంగడపల్లి చెరువు అలుగు దగ్గర ప్రాచీన కాలపు సమాధులు 'రాక్షసిగుళ్లు' ఉన్నాయి. ఇవి మాంచాలమ్మ గుట్టపై ఉన్నాయి.

పాఠం - 19

# సాహితీ రూపాలు

**1. సాహిత్యం అంటే ఏమిటి ?**

జ హితాన్ని కలుగ జేసేది, హితముతో కూడినది సాహిత్యం.

**2. కవిత్రయము గా పేరు పొందిన కవుల పేర్లు రాయండి?**

జ కవిత్రయముగా పేరుగాంచిన కవులు నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ.

**3. శృంగార నైషధం రాసినది ఎవరు ?**

జ శృంగార నైషధం రాసినది శ్రీనాథుడు.

**4. మను చరిత్ర, వసు చరిత్ర ఎవరి పాలనా కాలంలో రాశారు ?**

జ మను చరిత్ర, వసు చరిత్ర శ్రీకృష్ణదేవ రాయల పాలనా కాలంలో రాశారు.

**5. కవులు తమ రచనల కోసం పద్య రూపాన్ని ఎందుకు ఎంచుకున్నారు ?**

జ కవులు జ్ఞాపకం ఉంచుకోవడానికి తమ రచనల కోసం పద్య రూపం ఎంచుకున్నారు.

పాఠం - 21

# ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్

**1. వల్లభ్ బాయ్ పటేల్‌ను ఉక్కు మనిషి అని ఎందుకు అంటారు ?**

జ సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్ అత్యంత సాహసవంతుడైన రాజకీయ యోధుడు. నిజాం దుష్ట పాలన, రజాకర్ల దౌర్జన్యాల నుంచి ఆయన హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి కలిగించారు. దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్లను పటేల్ ఎంతో ధైర్యంగా, చాకచక్యంగా అణచివేశారు. అందుకే ఆయనను 'ఉక్కుమనిషి' అన్నారు.

**2. వల్లభ్ బాయ్ పటేల్ 1917లో ఏ కారణంతో సత్యాగ్రహ ఉద్యమాన్ని నడిపారు?**

జ వల్లభ్ బాయ్ పటేల్ 1917లో పంటలు దెబ్బతిన్నకారణంగా భూమిశిస్తు కట్టలేని రైతులకు మద్దతుగా సత్యాగ్రహ ఉద్యమాన్ని నడిపారు.

**3. సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్ చేపట్టిన, పాల్గొన్న ఉద్యమాల గురించి రాయండి ?**

జ సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నడచిన జాతీయోద్యమంలో పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. కిసాన్ ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించి ఎన్నో సార్లు జైలు శిక్ష అనుభవించారు.

**4. హైదరాబాద్ సంస్థానం విలీనం ఎలా జరిగింది ?**

జ దేశ విభజన తర్వాత చిన్న సంస్థానాలను పాలిస్తున్న రాజులు, నవాబులు స్వతంత్రంగా వ్యవహరించారు. అప్పుడు పటేల్ వివిధ మార్గాల్లో సంస్థానాలను విలీనం చేశారు. హైదరాబాద్ సంస్థానాన్ని నెహ్రూ యూరప్ పర్యటనలో ఉన్నప్పుడు తనకున్న అధికారంతో పటేల్ భారత భూభాగంలో కలిపేశారు.

**5. హైదరాబాద్ పోలీసు చర్య గురించి మీకు తెలిసింది రాయండి ?**

**జ** నిజాం మత రక్కసి పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం పెద్దఎత్తున ప్రజలు ఉద్యమించారు. కమ్యూనిస్టు పార్టీలు, ఆర్య సమాజ్ ఇందులో ముఖ్యపాత్ర పోషించాయి. రజాకార్ల దౌర్జన్యాలను అడ్డుకొని ఎందరో అమరులయ్యారు. ఈ పరిస్థితిని గమనించిన భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న సైనిక చర్య చేపట్టింది. దాంతో సెప్టెంబర్ 17న నిజాం తనంతటతానుగా లొంగి పోయాడు. దీనినే హైదరాబాద్ పోలీస్ చర్యగా చెప్పుకుంటారు.

పాఠం - 21

# విభక్తులు

**1. విభక్తి అంటే ఏమిటి ?**

జ వాక్యాలలోని పదాల మధ్య సంబంధాన్ని వ్యక్తం చేసే అక్షరాలను, పదాలను విభక్తులు అంటారు.

**2. విభక్తులు ఎన్ని రకాలు?**

జ విభక్తులు ప్రధానంగా ఏడురకాలు.

**3. ప్రథమ విభక్తి ప్రత్యయాలు ఏమిటి ?**

జ ప్రథమ విభక్తి ప్రత్యయాలు డు, ము, వు, లు

**4. ఔప విభక్తులతో కొన్ని వాక్యాలు రాయండి ?**

జ
1. తలకు దెబ్బ తగిలింది.
2. టేబుల్ పై పెట్టండి.
3. కొంగ నోటిలో చేప ఉంది.

ఇందులో కు, పై, లో ఔప విభక్తులు.